


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### డబ్బిచ్చే దెయ్యం

**అసలీ దెయ్యాల** సినిమాలు తీసేవాళ్ళకి స్క్రిప్ట్ అక్కర్లేదు అనుకుంట! అన్నీ ఒకేలా ఉంటాయి. నా చిన్నప్పటినుండీ చూస్తున్నానా.. ఇంగ్లీషు కానీ, హిందీ కానీ తెలుగుకానీ ఒకటే కథ.

నలుగురు అమ్మాయిలూ, అబ్బాయిలూ ఓ కారేసుకుని అడవిలోకి వెళ్తారా.. కారు ఆగిపోతుంది. చచ్చినా కదలనంటుంది. అది దెయ్యం పని. అసలీ అమ్మాయిలు అబ్బాయిలు అడవిలో ఉన్న ట్రావెలర్స్ బంగళాకే ఎందుకు వెళ్ళాలీ? ఊళ్ళో హోటళ్ళూ, ఖాళీ ఫ్లాట్లూ లేనట్లు.

సరే వెళ్ళారే అనుకుందాం. అక్కడ వున్న దెయ్యం (సాధారణంగా ఆడ దెయ్యాలే ఉంటాయి. వాటికి డ్రెస్ కోడ్, రీటా హెయిర్ ఆయిల్ ఏడ్‌లాగా కాళ్ళదాకా విరబోసుకున్న జుట్టూ, టినోపాల్ ఏడ్‌ని తలదన్నే విధంగా తెలుపు చీరా తప్పనిసరి.) శ్రావ్యంగా తాళం తప్పకుండా ఈ ఆడ దెయ్యాలు "నిను వీడని నీడని నేనూ" అని పాడుతూ ఉంటాయి. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కోసం అప్పటికే పోయిన దెయ్యం మ్యూజిక్ డైరెక్టర్లు ఎవరైనా హెల్ప్ చేస్తారని మన మనసుకి నచ్చచెప్పుకుందాం.

ఈ కారు ఆగిపోయిందన్నానే.. అక్కడే నాకో మిడిల్ క్లాసు డౌటు.

ఆ దెయ్యానికి కార్లు వున్న పిల్లలు తప్ప చవకబారుగా స్కూటరూ, సైకిల్ మీద వెళ్ళే వాళ్ళు నచ్చరా? అంత డబ్బు పిచ్చా?

దెయ్యం ఎవడి స్కూటర్ టైరూ పంక్చర్ చేసి ఆపదు. సైకిల్ చైను లాగేసి ఆపదు. కారు మాత్రం పాడుచేసి వాళ్ళు ఆగేట్లు చేస్తుంది.

సరే ఎదురుగా హాంటెడ్ హౌస్. చూడగానే మనకి తెలుస్తుంది. ఇది దెయ్యాల బంగళా అని. ఈ హీరో హీరోయిన్లకి తెలీదు. లోపలికి వెళ్ళేటప్పుడే "కిర్ ర్ ర్ ర్ ర్ ర్ ...." మని గేట్ తెరుచుకుంటుంది

అక్కడ వాడే దెయ్యం వేషంలో ఉన్నట్లు ఓ ముసలి వాచ్‌మెన్, లాంతరుతో ప్రత్యక్షం.

"ఇక్కడకి ఎవరైనా వచ్చి చాలా ఏళ్ళయింది.. ఎవరు మీరు?" అంటాడు.

వీళ్ళు భయంగా వాడివైపు చూస్తారు.

అదే నేనైతే "మరి నువ్వేం చేస్తున్నావ్? ఎవరూ లేనప్పుడు పని లేకుండా కూర్చుని, ఒక్కడివే కళ్ళు మూసుకుని 'చోర్ పోలీస్' ఆడ్తావా? ఆ గేట్‌కి కాస్త ఆయిల్ వెయ్యచ్చుగా... కిర్‌ర్‌ర్ మనకుండా" అంటాను. కానీ వాళ్ళు అనరు.

అలా మెల్లగా, వంగి, భయపెడ్తూ వచ్చి "రండి.." అంటాడు. లోపలంతా బూజులుంటాయి. ఈ వాచ్‌మెన్ గాడికి జీతం కట్ చెయ్యాలి. మెయిన్‌టైన్ చెయ్యనందుకు. మళ్ళీ నా డౌట్. ఎవరైనా ఓ వందేళ్ళకి పేటీఎమ్‌లో వీడి శాలరీ వేసేసి, వీడ్ని ఈ యింట్లో పనికి పెట్టారా? లేకపోతే ఏ భరోసాతో పని చేస్తాడు?

ఈ అమ్మాయిలూ, అబ్బాయిలూ ఇల్లు తిరిగి చూస్తారు. తీరా వాళ్ళ ఫేవరెట్ స్పాట్ బెడ్‌రూమ్ చూసేసరికి ఆగిపోతారు. వీళ్ళ సరదాలో వీళ్ళు ఉండగా, అక్కడున్న ఫోటోలు కళ్ళు ఆర్పుతుంటాయి. మనుషులేకాదు, వస్తువులు కూడా ఎంటర్‌టైన్‌మెంట్ లేక బోర్ చెందుతాయి అన్నమాట. ఆ వాచ్‌మెన్‌గాడి కాలక్షేపానికి పెంచుకున్న నల్లపిల్లి 'మ్యా...వ్' అంటుంది. అది బల్లమీదున్నది పారేసి తుర్‌ర్‌ర్‌మంటుంది. అన్నీ స్పెషల్ ఎఫెక్ట్సే.

అర్ధరాత్రి వీళ్ళు నిద్రలో ఉండగా కిర్ ర్ ర్ ర్ ర్ మళ్ళీ శబ్దం నాలాంటిదైతే శబ్దం వస్తే ఒంటరిగా వున్నప్పుడు, 'తెల్లారి చూద్దాంలే... వెధవగోల' అని దుప్పటి తలనిండా కప్పుకుని పడుకుంటుంది. కానీ వీళ్ళల్లో ఒకడు లేచి టార్చ్ తీసుకుని బయటకి వెళ్తాడు. ఎవడైనా బుద్ధున్నవాడు పట్టపగలే వెళ్ళడు కదా! అర్ధరాత్రి చీకటిలో శబ్దం వచ్చిన వైపుకి వెళ్తారా? ఇక్కడ హీరోయిన్ ఫ్రిజ్ తెరిచి నీళ్ళ బాటిల్ తీసుకుంటుందా, వెనకాల ఓ ఆకారం భయంకరమైన మొహంతో (అందమైన ఆడ దెయ్యాలు కేవలం హీరోలకే) అద్దంలో కనపడ్తుంది. 'కెవ్వు'మంటూ వెనక్కి తిరిగితే, అది దాని ఫ్రెండ్, మేకప్ లేకుండా నిద్రలో లేచొచ్చినట్టుంది పాపం.

"విక్రమ్ ఏడీ? నా మంచం మీద లేడూ?" అంటుంది.

"అవునా?" అని అందరూ లైట్లేసి ఇప్పటిదాకా స్పెషల్ ఎఫెక్ట్స్ కోసం చీకట్లో ఉంటారు. విక్రం కోసం వెతుకుతారు. ఇప్పుడు నాకు మళ్ళీ డౌట్. మనలో ఒకరు బయటికెళ్ళి కనిపించకుండా పోతే, ఉన్న నలుగురూ కలిసికట్టుగా వెతకాలా "నేనిటు వెళ్తా.. నువ్వు అటు వెళ్ళు. మాలినీ, ఆషా.. మీరు ఇక్కడే ఉండండి ఒంటరిగా" అంటారా? ఇది ఐక్యూకి సంబంధించిన విషయం కాదా? ఆ టైంలోనే ఎయిర్‌టెల్ వాడు పగపట్టినట్లు ఎవడి సెల్లూ పనిచెయ్యదు.

ఈలోగా శ్రేయాఘోషల్ పాట మొదలయిపోతుంది. మధ్య మధ్యలో గాలి.. ఊళలు పెడ్తూ.. పిల్లి వీళ్ళని చూసి కళ్ళు ఆర్పి 'మ్యావ్' అని బెదిరిస్తూ షాట్స్. పరదాలు తెగ ఎగురుతాయి. ఇవన్నీ తనకి అలవాటే అన్నట్లు చుట్టకాల్చుకుంటూ, ఒంటరిగా ఉన్నప్పుడు తన ఫేవరెట్ పాస్ టైం 'పెన్‌లతో ఒక్కడే కత్తి ఫైటింగ్' చేసుకుంటూ ఆ వాచ్‌మెన్ తాత ఎక్కడో ఉంటాడు.

అంతా అయి ఒకడి శవంతో తిరిగొచ్చాక, వాచ్‌మెన్ వచ్చి చూసి "అయితే మీరూ రాత్రి 'చాందినీ' దెయ్యాన్ని చూసారనమాట" అంటాడు. చాందినీ వహిదారెహమాన్ లేక సన్నీలియోన్ అంత అందగత్తె (కాలమానం ప్రకారం)

"సన్నీలియోన్ ఎవరూ?" అంటుంది హీరోయిన్. అప్పటిదాకా తమతో కలిసున్న ఫ్రెండ్ ఒకడు చచ్చాడు. వాడి తల్లిదండ్రులకి ఏం చెప్పాలి? వాడి ప్రియురాలెలా ఓదార్చాలి అని లేదు ఈ కుతూహలమ్మకి.

ఆ శవాన్ని దాని ఖర్మకొదిలేసి "ఇరవై ఏళ్ళ క్రితం" అంటూ బీస్ సాల్ బాద్ పురానీ కథ చెప్పుకొస్తాడు వాచ్‌మెన్.

వీడి కథ బోర్ కొట్టి టీ.వీ చూద్దామని లోపలికి వెళ్ళిన కమేడియన్‌తో కాసేపు హాస్యాలు చేస్తుందో పిల్ల దయ్యం. అదంతా హ్యూమర్ కోసం. ఎందుకంటే దెయ్యాల్లో కమేడియన్లు చచ్చిపోయినవాళ్ళు కూడా ఉంటారుగా. అలాగే ఇక్కడ హత్యలు చేసి చచ్చిపోయిన కిరాతకులు కూడా, దెయ్యాలయి "మమ్మల్ని పోలీసులేం చెయ్యలేరుగా.. హ..హ..హ" అంటూ వాళ్ళు కిరాతకాలు చేస్తూవుంటారు.

"ఏరా టీ.వీ చూస్తున్నావా?" అంటూ వచ్చి ఆల్చిప్పల్లా కళ్ళు తెరుచుకుని వున్నవాడిని కుదిపితే, పక్కకి వాలిపోతాడు. అలా ఒక్కొక్కళ్ళే చచ్చిపోతున్నా వీళ్ళు ఆ కొంప వదిలిపోరు. వీళ్ళ దుంపలు తెగ.

"చాలా భయం వేస్తోందే" అంటూ మిగిలిన ముగ్గురూ, ఒక సోఫాలో చావరు. వేరే వేరే గదుల్లో దూరతారు.

ఈ వాచ్‌మెన్ గాడు ఇదంతా తమాషా చూస్తుంటాడు. ఆ దెయ్యాలు వాడి పెంపుడు దెయ్యాల్లా, వాడిని ఏమీ చెయ్యవు. లేదా వాడి ఒంట్లో చారెడు రక్తం పావుకిలో మాంసం వాటికి చాలవేమో? ఈ పక్క ఒకళ్ళ తరువాత ఒకళ్ళు శవాలై గుట్టలు పడ్తున్నా. వాళ్ళని బయటకి ఈడ్చి మిగిలినవాళు 'రొమేన్స్'లు చేసేస్తూ, వీలైతే పాటలూ డాన్సులూ కానిచ్చేస్తుంటారు. ఆడదెయ్యం పగతీరేదాకా పాటలు పాడి, టినోపాల్ చీరలు కట్టి, చివరికి పౌడర్ ఫేస్‌తో ముందుకొస్తుంది. మొహం అంతా పౌడర్ రాసుకోడానికి దానికంత టైం ఎక్కడిదో, పౌడర్ డబ్బా ఎవడు కొనిచ్చాడో?

ఇవన్నీ చాలవన్నట్లు ఆ ఊళ్ళో పాలవాడూ, బయట జట్కాబండి తోలుకునేవాడు కూడా ఎవరైనా పలకరిస్తే దెయ్యాల్లా తలలు తిప్పి, బేస్ వాయిస్‌లో 'మేం చచ్చి వంద ఏళ్ళయింది' అన్నట్లు ప్రవర్తిస్తారు.

కొన్నాళ్ళు 'రాంసే' సినిమాలొచ్చేవి. మాకు తెలుసున్న వాళ్ళ అమ్మాయి ఒకత్తి, ఎమ్.బి.ఏ చేస్తున్న పిల్ల ఈ దెయ్యపు సినిమా చూసి ప్రభావితం అయిపోయి డబ్బాలోంచి కిలోల కిలోలు కుంకుమ నుదుటికి పూసేసుకుంటూ భయంతో బిగుసుకుపోయి 'అదిగదిగో వంట గదిలో దెయ్యం.. పడకగదిలో దెయ్యం' అంటూ పిచ్చెక్కిపోయింది. వాళ్ళమ్మా నాన్నా సైక్రియాట్రిస్టులకీ, మాంత్రికులకీ లక్షలు ఖర్చుపెట్టారు. ఈ 'యూట్యూబ్‌లలో' సినిమాలు చూడనేల? ఆ భూతవైద్యులకి సినిమా దెయ్యాలు వదలగొట్టడానికి డబ్బులు పెట్టనేల? చిన్నప్పటినుండీ చూస్తున్న మనిషికి ఈ దెయ్యం అంటే ఫాంటసీ. దేవుడ్ని నమ్మను అనే రాంగోపాలవర్మ కూడా 'దెయ్యాల్ని' నమ్మి చాలా సినిమాలు తీసాడు. అసలు 'దెయ్యాన్ని' నమ్ముకున్న వాడెవడూ చెడిపోలేదు. రచయితులతో సహా. ఇంగ్లీషు రచయితలకైతే మరీ సరదా. హాంటెడ్ హౌస్‌లు మినిమమ్ గ్యారంటీ సబ్జెక్టులు వాళ్ళకి.

అసలు దెయ్యాలున్నాయా లేవా? అనే చర్చ నేను చచ్చినా చెయ్యను. ఎందుకంటే వాటిని నమ్ముకుని జీవిస్తున్న వాళ్ళ పొట్టకొట్టలేం. కొంతమంది ఆర్టిస్టులు కూచిపూడి డాన్సర్లలాగా, నడుం వరకు స్టిఫ్‌గా వుండి పై పార్ట్ మాత్రమే కదుల్తూ నడిచే హీరోయిన్లు, దెయ్యాల పాత్రల్లో జీవించారు. అలాగే దెయ్యం పట్టిన పాత్రల్లో 'వాడా' అంటూ ఎవార్డులు పొందిన వాళ్ళూ ఉన్నారు. మామూలు మనుషుల కన్నా దెయ్యాలకి అందం, నాట్యం, సంగీతం, పొడవాటి కురులూ, మంచి చీరలూ ఎంతైనా అవసరం. కొన్నిసార్లు మొహం అంతా పౌడరూ, కాటుకలూ. రీ రికార్డింగులు దెయ్యం సినిమాలకి ప్రత్యేకంగా ఉంటాయి.

'హిస్..స్' సౌండ్స్‌తో, టేబుల్ మీదనుండి గుండి సూది కింద పడ్తే 'టింగ్' అని గుండెలవిసేటట్లు సౌండ్ ఎఫెక్ట్స్ ఇవ్వగలిగిన మ్యూజిక్ డైరెక్టర్లు కావాలి. 'లేకిన్' అనే వినోద్‌ఖన్నా, డింపుల్ కపాడియా సినిమా చూసా. అందులో 'హృదయనాథ్ మంగేష్కర్' మ్యూజిక్ చేసిన లతామంగేష్కర్ పాటలూ, ఆ దెయ్యం అందం వుంటుంది కదా... అసలు ఎవడికైనా ప్రేమిస్తే అలాంటి దెయ్యాన్నే ప్రేమించాలనిపిస్తుంది.

విఠలాచార్యకూడా చివరిరోజుల్లో 'జగన్మోహినీ', 'గంధర్వకన్య'లాంటి పగపట్టిన దెయ్యం సినిమాలు జయమాలినిని పెట్టి తీసి, అందం తెర నిండా పరిచేసారు. దెయ్యం పగపడ్తే భలే బావుంటుంది. ఎందుకంటే బ్రతికుండగా చెయ్యలేని ఎన్నో పనులు చచ్చాక చెయ్యొచ్చు. శక్తులొస్తాయి. అదృశ్యంగా ఉండి ఎవడినైనా తలమీద కొట్టడం, జిలేబీలూ, జాంగ్రీలూ, లడ్డూలు తినిపించి ఆ తరువాత నెత్తిమీద కొడితే వాటి నోట్లోంచి తేళ్ళూ, పాములూ, జెర్రులూ కిందపడటంలాంటివి.

నాకైతే జగన్మోహిని సినిమాలో జుట్టు విరబోసుకున్న పొట్టి దెయ్యం పొయ్యిలో కాళ్ళు పెట్టిమండిస్తూ వంట చేసే సీన్ చాలా ఇష్టం.

సినిమా వాళ్ళకి 'దెయ్యం' తరువాత విపరీతంగా డబ్బు ఆర్జించి పెట్టిన సబ్జెక్ట్ 'పాము' పగ. ఇప్పుడు అది బుల్లి తెరకి వ్యాపించి సిరీస్‌గా ఆ 'నాగిని' కథలు వస్తూనే ఉన్నాయి. మనిషి మొహాలు కన్నా ఈ నాగుపాములకీ, దెయ్యాలకీ ఇంతింత అందాలు ఎక్కడినుండొస్తున్నాయో? అవీ అంతే పాము మనిషిగా మారాక దివ్య శక్తులొస్తాయి. విలన్లని ఎగరేసి తన్నగలవు. లేదా పిట్టగానో

జంతువుగానో మార్చగలవు. ముఖ్యంగా విలన్‌లు గాల్లో తేలుతూ, చెట్లకీ పుట్టలకీ 'ఢాం ఢాం' అని కొట్టుకుంటుంటే, ఆడ విలన్లు మొహాలు రాక్షసుల్లా మారిపోయి, భయంకరంగా కనిపిస్తుంటే, చుట్టుపక్కల వాళ్ళు రాళ్ళు వేసి కొడుతుంటేనూ మనకి నవ్వొస్తుంది.

నిజానికి మనుషులకన్నా ఈ 'దెయ్యాలు' అంత ప్రమాదకరమైనవి కావేమోన్రా!

Post your comments

